నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం | 01 అక్టోబర్ 2024 | పేజీలు 8

## సూపర్ సిక్స్‌లో ఒక రన్ కూడా కొట్టలేదు

- తిరుపతి లడ్డు ప్రసాదం విషయంలో సుప్రీంకోర్ట్ జడ్జిచే విచారణ చేయించాలి
- డీసీసీ అధ్యక్షుడు చేవూరు డిమాండ్



2లో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్‌లో ఒక్క రన్ కూడా కొట్టలేదని డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి విమర్శించారు. - నెల్లూరు, మేజర్‌న్యూస్ :

# జిల్లా వైద్యశాల బారెడు.. సేవలు జానెడు!

**అమలుకాని గత మంత్రి హామీలు - వైద్యుల, సిబ్బంది కొరత**





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

ఆత్మకూరులో 30 పడకల ఆసుపత్రిగా గతంలో ఉండేది. సక్రమంగా వైద్యులను నియమించకపోవడంతో రోగులు వైద్య సేవలకు వెళ్ళే పరిస్థితే లేకపోయింది. అయితే ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి తొలుత 100 పడకల ప్రాంతీయ వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేయించడంతోపాటు ఆయన ప్రతిపాదనలతో 150 పడకల జిల్లా వైద్యశాలగా రూపాంతరం చెందింది. అయినా వైద్యసేవలు అందడం లేదని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సర్వత్రా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ హాస్పిటల్ అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. ఆత్మకూరులో తొలుత 10 బెడ్‌ల హాస్పిటల్‌గా ఉండగా, అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ బమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి 30 పడకల హాస్పిటల్‌గా మార్పించారు. అయితే నామమాత్రంగా వైద్యులను నియమించడంతో ఈ హాస్పిటల్‌కు చికిత్సల కోసం అతి తక్కువ మంది మాత్రమే వెళుతుండేవారు. కాగా ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరును మున్సిపాలిటీగా, రెవిన్యూ డివిజన్‌గా చేయడంతోపాటు 100 పడకల ప్రాంతీయ వైద్యశాలను కూడా మంజూరు చేయించి, దాదాపు 23 కోట్ల రూపాయలు నిధులు మంజూరుతో భవనాలను కూడా నిర్మించారు. 2012లో మెట్ట ప్రాంతమైన ఆత్మకూరులో ప్రాంతీయ వైద్యశాలను ఏర్పాటు చేస్తే మరో మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గానికి ప్రయోజకరంగా ఉంటుందన్న ఆశయంతో ఏర్పాటు చేయించారు. ఈ రెండు నియోజకవర్గాలతోపాటు కడప జిల్లా బద్వేలు ప్రాంతం నుండి కూడా రోగులు ఇక్కడకే వైద్యసేవల కోసం వస్తుండేవారు. అత్యంత సౌకర్యవంతంగా అధునాతన భవనాలు, వైద్యులకు, సిబ్బందికి క్వార్టర్లు కూడా నిర్మించగా.. కొందరు వైద్య నిపుణులు, సిబ్బందిని నియమించగా, రోజుకు 450 పైచిలుకు రోగులు వైద్య సేవలు పొందుతుండేవారు. అయితే అప్పట్లో 100 పడకల స్థాయికి తగ్గట్లుగా వైద్యులను, సిబ్బందిని నియమించలేదని పలువురు ఆవేదన చెందుతుండేవారు. 2014లో అప్పటి కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఈ హాస్పిటల్‌ను ప్రారంభించారు. 2015లో అప్పటి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు ఈ హాస్పిటల్‌కు విచ్చేసి కలెక్టర్ జానకి ఆధ్వర్యంలో జరిగిన కమిటీ సమావేశంలో పాల్గొని సమస్యలు తెలుసుకొని, వెంటనే రాష్ట్ర డైరెక్టర్‌కు ఫోన్ చేసి అతి త్వరలో పూర్తిగా వైద్యులను, సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా ఆనం రామనారాయణరెడ్డి అప్పటికే -మిగతా 2లో



పూర్వ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ సమావేశం (ఫైల్)

# నీకింత.. నాకింత!



**డాక్యుమెంట్ రైటర్ల దోపిడీపై ప్రత్యేక కథనం -2**

**రొట్టె ముక్కలు పంచుకున్నట్టుగా.. గత ప్రభుత్వంలో డాక్యుమెంట్ రైటర్లు, రెవెన్యూ శాఖలోని కొంతమంది వీఆర్వోలు ఆర్థిక లావాదేవీలు పుష్కలంగా నడిపారు. 'నీకింత.. నాకింత' అనేవిధంగా సమర్థవంతంగా సంపాదించారు.**

- ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియలో మాయాజాలం !
- గత ప్రభుత్వంలో వీఆర్వోలకు.. డాక్యుమెంట్ రైటర్లకు ఆర్థిక లావాదేవీలు
- రిజిస్ట్రేషన్‌కు స్థలం అర్హత లేకపోయినా.. సర్టిఫికేట్ ఉంటే చాలు !

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :**

మండల కేంద్రంలోని కొంత మంది డాక్యుమెంట్ రైటర్లు ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ విషయాల్లో కొనుగోలుదారులను పెద్ద ఎత్తున దోచుకుని మోసం చేశారు. కొంత మంది డాక్యుమెంట్ రైటర్లు నిజాయి తీగా ఉండగా.. మరి కొంతమంది అందిన కాడికి దోచుకున్నారు. సర్టిఫికెట్లకు వేల రూపాయలు వసూలు చేసుకుని భాగాలు పంచుకున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లు కూడా చేయించారు. ప్రభుత్వం విచారిస్తే అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తాయనడంలో సందేహం లేదు.

### సర్టిఫికెట్లు తీసుకొచ్చేందుకు అంకణానికి రూ.వంద వసూళ్లు

ఎవరైనా తమ స్థలాలను ఇతరులకి అమ్మకాలు చేసే ప్రక్రియలో కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు కీలకపాత్ర పోషించారు. ప్రభుత్వ స్థలమైన ప్రైవేట్ స్థలమైన సరే కాసులు వసూలు చేశారు. వాస్తవంగా స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ఇళ్ల -మిగతా 2లో

**పాపాత్ములకు శిక్ష పడాలి..**

## కల్తీ నెయ్యి నిగ్గు తేలాలి !


- శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అంగప్రదర్శన, నారాయణ హోమం
- జనసేన సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్

2లో



# సూపర్ సిక్స్‌లో ఒక రన్ కూడా కొట్టలేదు

**తిరుపతి లడ్డు విషయంలో సుప్రీంకోర్ట్ జడ్జిచే విచారణ చేయించాలి - డీసీసీ అధ్యక్షుడు చేవూరు డిమాండ్**



నెల్లూరు, మేజర్‌న్యూస్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్‌లో ఒక్క రన్ కూడా కొట్టలేదని డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి విమర్శించారు. ఇంద్రభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ ఎప్పుడో చెప్పాలని, బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పేర్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వంద రోజుల మంచి పాలన అని మురిసిపోవడం సిగ్గుచేటని తెలిపారు. గత వంద రోజులుగా కక్ష సాధింపు ధోరణలు తప్ప.. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, మూడు సిలిండర్ల ఉచితం, యువగళం, రైతుల పెట్టుబడి సహాయం కింద 20 వేల రూపాయలు ఇస్తానన్న ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొట్టిందని విమర్శించారు. అఖిలాండకోటి పూజనీయుడు వెంకటేశ్వర స్వామి దైవప్రసాదమైన లడ్డును రోడ్డుకీడ్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందని, వైసీపీ తప్పుడు విధానాలు అవలంభిస్తే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలో న్యాయ విచారణ జరపాలి తప్ప.. హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రవర్తన తీరు గర్హనీయమన్నారు. హిందువుల మనోభావాలు రాజకీయ కక్షతో దెబ్బతింటుంటే బీజేపీ ఢిల్లీ పెద్దలు చోద్యం చూస్తున్నారని చేవూరు అన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు యాదవ్ మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలను తెలుగుదేశం ప్రభుత్వం గద్దెనెక్కిన వెంటనే అమలు చేస్తామని చెప్పి, కనీసం సరిగ్గా సింగిల్ కూడా తీయలేని చంద్రబాబు మాయమాటలతో ప్రజలను మోసం చేశారని ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తా అని ముందుకొచ్చిన పవన్ కళ్యాణ్, నాలుగు నెలలైనా ప్రత్యేక హోదా విషయమై కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఎందుకు అడగలేదో ఆంధ్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోపక్క విశాఖ స్టీల్‌ప్లాంట్ స్థలాన్ని ఇబ్బడి ముబ్బడిగా అమ్మి వేస్తుంటే ఏమీ తెలియనట్లు నిజజీవితంలో దశావతారంలో నటించినట్లు పవన్ కళ్యాణ్ ప్రవర్తన ఉందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, నిధులు తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ ఫయాజ్, ఏటూరి శ్రీనివాసుల రెడ్డి, పీసీసీ మెంబర్ బాల సుధాకర్, మోహన్ రెడ్డి, సురేష్, మీడియా ఇంచార్జ్ కే.సంజయ్ కుమార్, అడ్వకేట్ మల్లి కిషోర్ రెడ్డి, షేక్ హుస్సేన్ బాషా, షేక్ అల్లావుద్దీన్, గణేష్, ఐఎన్టియుసి సుబ్బారావు, దోంతాల మోహన్, మల్లికార్జున రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాజా, అరవదాస్, డాక్టర్ ప్రసాద్, యుగంధర్, సేవాదళ్ సుజాత, మంజుల, ఆదినారాయణ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, యోగ, షేక్ నజీర్, షేక్ సమీర్, సయ్యద్ షానవాజ్, షేక్ హనీఫ్, నాగిరెడ్డి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**పాపాత్ములకు శిక్ష పడాలి..**

## కల్తీ నెయ్యి నిగ్గు తేలాలి !

నెల్లూరు జడ్పీ, మేజర్‌న్యూస్ : తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి వాడిన పాపాత్ములకు కఠిన శిక్ష పడాలని జనసేన పార్టీ సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున్ యాదవ్ డిమాండ్ చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో నిజా నిజాలు బహిర్గతం కావాలని ఆయన కోరారు. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా, ఆ పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సూచన మేరకు సోమవారం ఆయన స్థానిక శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అంగ ప్రదర్శన, నారాయణ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె మల్లికార్జున యాదవ్ విలేకరులతో మాట్లాడారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. గత వైసీపీ పాలనంతా పాపాల పుట్టగా మారిందని ఆరోపించారు. కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో అనేక అక్రమాలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ జరగాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సుందర్ రామిరెడ్డి, నజీర్ బాషా, గీత వైభవ్ ట్రస్ట్ చైర్మన్, శ్రీరామ్ లాయర్, గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, రవికుమార్ ఏటూరి, రిషి యాదవ్, హరిప్రసాద్ మాలే, కస్తూరి కొండాపురం, రేణుక, నందిని, వరలక్ష్మి, ప్రసన్న, సుమలత, షేక్ అలియా, పవన్ యాదవ్, ఐటి చరణ్, వెంకటరమణ, శ్రీనివాసులు సోయం బేటి, కృష్ణమోహన్ రెడ్డి, సురేష్ బాబు గాంధీనగర్, జూటూరు మహేష్ శర్మ, వినయ్ శర్మ, సూర్య శర్మ, మనోజ్ శర్మ, ఆనంద్ 35వ వార్డు, పసుపులేటి మహేష్, శ్రీనివాసులు నాయుడు జొన్నవాడ, శీను ముదిరాజ్, పార్టీ ఆఫీస్ ఇంచార్జ్ జమీర్ వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

## నీకింత.. నాకింత !

*(మొదటి పేజీ తరువాయి)*

స్థలాలు రిజిస్ట్రేషన్ జరగాలంటే చట్టబద్ధమైన రికార్డులు ఉండాలి. లింక్ డాక్యుమెంట్లు తప్పని సరిగా ఉండాలి. అయితే అక్రమ సంపాదన అలవాటు పడిన కొంత మంది డాక్యుమెంట్ రైటర్లు ఇలాంటివి పట్టించుకోకుండా.. అప్పటి అధికారులు చేత చట్ట విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. ఈ స్థలం నీదే అని చెప్పేందుకు గ్రామ రెవెన్యూ అధికారులు ధ్రువీకరించిన సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్ దగ్గర కొంత మంది డాక్యుమెంట్ రైటర్లు మాయాజాలం చూపించారు. ఈ విషయంలో పెద్ద ఎత్తున దోచుకున్నారు. గత ప్రభుత్వంలో పని చేసిన గ్రామ రెవెన్యూ అధికారులకు లంచాలు రుచి చూపించిన ఘనత ఆ డాక్యుమెంట్ రైటర్లలో కొంత మందికి చెందుతుంది. అంకణానికి వంద రూపాయలు నుంచి 200 రూపాయల వరకు బేరంపెట్టారు. 10 అంకణాలు స్థలానికి గ్రామ రెవెన్యూ అధికారులు సర్టిఫికెట్ ఇవ్వాలంటే 2 వేల రూపాయలు లెక్కన ధర పెట్టారు. దీనిలో కూడా కొంత మంది డాక్యుమెంట్ రైటర్లు కమిషన్లు తీసుకున్నారు. రిజిస్ట్రేషన్ కాని స్థలాలను కూడా రిజిస్ట్రేషన్లు చేయించారు. వేలకు వేలు అక్రమ సంపాదన గల్లాపెట్టెలో వేసుకున్నారు. ఎక్కువ పరిశ్రమ ప్రాంతాల్లో ఈ బాగోతం జరిగింది. ప్రభుత్వంలో పని చేసిన కొంత మంది గ్రామ రెవెన్యూ అధికారులు లంచాలకు కక్కుర్తి పడి డాక్యుమెంట్ రైటర్లతో కుమ్మక్కై రిజిస్ట్రేషన్లకు అర్హత లేని స్థలాలకు కూడా సర్టిఫికెట్లు మంజూరు చేయించారు. ఇదంతా కొంత మంది డాక్యుమెంట్ రైటర్ల కనుసన్నల్లో జరిగింది.



దర్జాగా.. అనధికార డాక్యుమెంట్ రైటర్లు దోపిడీ

'సూర్య' దినపత్రికలో ప్రచురితమైన దర్జాగా అనధికార డాక్యుమెంట్ రైటర్ల దోపిడీ కథనం-1




**ప్రభుత్వం విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి..**

డాక్యుమెంట్ రైటర్లు, గత ప్రభుత్వంలో పని చేసిన కొంతమంది గ్రామ రెవెన్యూ అధికారులు అవినీతి లీలలపై ప్రభుత్వం విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ప్రభుత్వ స్థలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించేందుకు సహకరించి సర్టిఫికెట్లు ఇచ్చారు. అదేవిధంగా కొంత మంది పంచాయతీ కార్యదర్శులు కూడా ధృవీకరణ పత్రాలు ఇచ్చిన సందర్భాలున్నాయి. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధికారులు మారినప్పుడు వ్యవస్థ మారింది. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ చేస్తే.. డాక్యుమెంట్ రైటర్ల అక్రమాలు కచ్చితంగా బహిర్గతమవుతాయి.

# జిల్లా వైద్యశాల బారెడు.. సేవలు జానెడు

*(మొదటి పేజీ తరువాయి)*

చేసిన ప్రతిపాదన మేరకు 2017లో 100 పడకల ప్రాంతీయ వైద్యశాలను 150 పడకల జిల్లా వైద్యశాలగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. జిల్లా వైద్యశాల స్థాయి వైద్యులను, సిబ్బందిని ఇప్పటికీ నియమించకపోగా, ముఖ్యమైన వైద్య పరికరాలను కూడా సమకూర్చలేదు. ఇక్కడ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ ఎల్.చెన్నయ్య, ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్ఎంవో డాక్టర్ ఉషాసుందరిలు హాస్పిటల్‌ను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తూ, ఉన్న వైద్యులు, సిబ్బంది ద్వారానే ప్రజలకు వైద్యసేవలందించసాగారు. కానీ 150 పడకల స్థాయి వైద్యులను, సిబ్బందిని ప్రభుత్వం నియమించకపోయింది. ప్రస్తుతం వైద్యులు, సిబ్బంది 136 మంది ఉండాల్సి ఉండగా, 72 మంది మాత్రమే పని చేస్తున్నారని, 64 ఖాళీలున్నాయని, జిల్లా హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ అయినా బెడ్లు గతంలో సమకూర్చిన 100 మాత్రమే ఉండగా, మిగతా 50 బెడ్లను సరఫరా చేయలేదని గత ఏడాది వరకు చెబుతుండేవారు.

హాస్పిటల్‌లో వైద్యులు, సిబ్బంది కొరతతో ప్రజలకు ఆశించిన లక్ష్యం మేరకు ప్రజలకు వైద్యసేవలందడం లేదని సర్వత్రా చెబుతున్నారు. తాజాగా పరిస్థితి చూస్తే 26 మంది వైద్య నిపుణులకు గాను 17 మంది పని చేస్తుండగా, 9 మంది వైద్య నిపుణుల ఖాళీలున్నాయి. 20 మంది మినిస్టీరియల్ సిబ్బందికిగాను 11 మంది పని చేస్తుండగా, 9 ఖాళీలున్నాయి. సివిల్‌సర్జన్ స్పెషలిస్టులు 10 మందికిగాను 7 మంది ఉండగా, 3 ఖాళీలున్నాయి. ఒక ఆర్ఎంవో ఉన్నారు. డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు 5 మందికి గాను 3 పని చేస్తుండగా, 2 ఖాళీలున్నాయి. సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులు 11 పోస్టులకుగాను 7 మంది పని చేస్తున్నారు. నాలుగు ఖాళీలున్నాయి. ఒక స్టాఫ్‌నర్స్, రెండు డార్క్‌రూమ్ అసిస్టెంట్, ఒక ఆఫీస్ సూపరింటెండెంట్, 3 జూనియర్ అసిస్టెంట్, 2 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలున్నాయి. లక్ష్యం మేరకు వైద్య సేవలు లభించకపోగా ఎన్ని దఫాలుగా మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినా సిబ్బంది, వైద్యుల కొరత గురించి పట్టించుకోలేదు. ఇక తాజా పరిస్థితిని బట్టి ఈ హాస్పిటల్ లక్ష్యం దూరం కాగలదని, మనుగడ కష్టతరంగా మారనుందని, జిల్లా హాస్పిటల్ ఉన్నా అందుకు తగినట్లుగా వైద్యసేవలు లభించే పరిస్థితి లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ దఫా ఇక్కడ ఎమ్మెల్యేగా ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించడం, రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి వైద్యులు, సిబ్బందిని సమకూర్చాలని, వైద్యులను నియమించి.. వారు వచ్చి చేరేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' చందంగా ఈ హాస్పిటల్ మారకుండేలా ప్రభుత్వం శ్రద్ధ చూపాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న వైద్యులు నిపుణులుగా ఉంటూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందిస్తున్నారు. మిగిలిన వారిని కూడా నియమించి అవసరమైన పరికరాలను సమకూర్చాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



వైద్యశాల అధునాతన భవనాలు

# ఆత్మకూరులో ఇసుక ఇక్కట్లు తొలిగేదెన్నడు

ఆత్మకూరు, మేజర్‌న్యూస్ : ఆత్మకూరు పట్టణంలో, మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో ఇసుక లభించక భవననిర్మాణ యజమానులు తీవ్రంగా ఇబ్బందిపడుతుండగా భవననిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నామని లబోదిబో మంటున్నారు. ఆత్మకూరు మండలానికి ఇసుక అందుబాటులోకి వచ్చేదెన్నటికో అని పలువురు ప్రశ్నిస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ఇసుక అందుబాటులో ఉచితంగా లభిస్తుందని అందరూ ఎంతగానో ఆశపడ్డారు. తీరా నాలుగునెలలైనా ఆత్మకూరు పట్టణానికి, మండలానికి ఇసుక అందుబాటులోలేకపోగా చారెడు కూడా దొరికే పరిస్థితి లేదు. అదీగాక ఇసుక లబించేచోట పరిస్థితి గమనిస్తుంటే ఉచితమన్నమాటేకానీ కొనుగోలు చేయాల్సిందేనని, అదీగాక అధికంగా వ్యయం చేయాల్సినట్లుగా ఉందని సర్వత్రా వాపోతున్నారు. గతం ప్రభుత్వంలో ఇసుక కొరతతో అందరూ తీవ్రంగా ఇబ్బంది పడగా ఇసుకాసురులు మాత్రం మాఫియాలుగా ఏర్పడి నదుల్లో ఇసుకను కొల్లగొట్టడం, రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చెలరేగడం తెల్సిందే. కాగా తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ఇసుక ఉచితంగా లభిస్తుందన్న హామీ మేరకు అందరూ ఎదురుచూస్తుండగా ఆత్మకూరు మండలంలో ఇసుకరీచ్‌ను కూడా నిర్ధారణ చేయలేదు. మండలంలోని అప్పారావుపాళెం వద్ద పెన్నానది, బట్టేపాడు మార్గంలో బొగ్గేరు ఉన్నాయి. ఇసుకరీచ్ మాత్రం అప్పారావుపాళెం వద్ద ఉంటుందేది. పెన్నానదిలో ఇసుక నాణ్యంగా ఉంటుందని, బొగ్గేరులో ఓమోస్తరుగా ఉంటుందని భావిస్తుంటారు. అయితే ఈదపా ఇప్పటివరకు అప్పారావుపాళెం వద్ద ఇసుకరీచ్‌ను నిర్ధారించడం కానీ, ప్రారంభించడం కానీ జరగలేదు. దాంతో గత నాలుగునెలలుగా జనాలు ఇసుకకొరతతో అల్లాడుతున్నారు. పెన్నానది, బొగ్గేరులవద్దకు ఇసుకకు వెళ్ళాలంటే పోలీసులు పట్టుకొని వాహనాలను సీజ్‌చేస్తున్నారు. కేసులు నమోదైతే



పెద్దమొత్తంలో అపరాధరుసుము చెల్లించాల్సి ఉంటుంది. దాంతో ట్రాక్టర్ల యజమానులు ఇసుక వైపుకు వెళ్ళాలంటే హడలిపోతున్నారు. ఒకటిఅరా ట్రాక్టర్లు దొంగచాటుగా ఇసుకను బొగ్గేరు నుండి తరలిస్తుంటే వారికి తనిఖీలు, మామూళ్ళ బెడద తప్పడం లేదు. అదీగాక ఆత్మకూరులో ఇటీవల పోలీస్ అధికారులు నూతనంగా వచ్చారు. వారు కఠినతరంగా వ్యవహరిస్తున్నారని, తమకు ఇసుకకొరత తీవ్రంగా ఇబ్బందికరంగా ఉంటుందని, పనులు ఆగిపోతున్నాయని ట్రాక్టర్ల యజమానులు, భవననిర్మాణదారులు, కార్మికులు చర్చించుకుంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వంపై అసంతృప్తి కూడా వ్యక్తం చేస్తున్నారు. ఇసుకకు తీవ్రంగా ఇబ్బందిపడుతుండగా ఇంకా ప్రభుత్వం ఇక్కడ ఇసుకరీచ్‌ను ఏర్పాటుచేయకుండా కాలయాపన చేస్తుండడం అత్యంత విచారకరమని, బాధాకరమని అభిప్రాయపడుతున్నారు. మరి ఇసుక ఇబ్బందులు ఎప్పటికి తొలగనున్నాయో చూడాల్సి ఉంది.

# పౌష్టికాహారం పట్ల చైతన్యం పొందాలి



## సదస్సులకు సార్థకత చేకూర్చాలి : సీడీపీఓ సునీలత

ఆత్మకూరు, మేజర్‌న్యూస్ : సమాజంలో మహిళలు, ప్రధానంగా గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం పట్ల అవగాహన పొందించుకోవాలని, తగిన చైతన్యం పొందాలని, అవగాహన కల్పించేలా ముమ్మరంగా నెలరోజుల పాటు నిర్వహించిన ర్యాలీలు, పౌష్టికాహార ప్రదర్శనలు, సదస్సులకు సార్థకత చేకూర్చేలా అందరూ పోషకవిలువల ఆహారాన్ని తీసుకోవాలని ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీఓ పి.సునీలతలు పిలుపునిచ్చారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని వెస్ట్‌ముస్లిం ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారమాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రధార్థాల, ఆకుకూరల, కాయగూరల పదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన సదస్సులో సీడీపీఓ సునీలతలు ప్రసంగించారు. ప్రతి గర్భిణీ, ప్రతి బాలింత, పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలంటే తప్పకుండా పోషకవిలువల ఆహారం తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు పాలు, కోడిగ్రుడ్లు, బాలామృతం తదితరాలను అందిస్తుండడంతోపాటు పోషకవిలువల ఆహారపదార్థాలను టేక్‌హోమ్‌రేషన్‌గా ఇస్తున్నామని, వాటితోపాటు తమకు అందుబాటులో లభించే పోషకవిలువల ఆహారాన్ని కూడా తీసుకోవాలన్నారు. తద్వారా అందరూ ఆరోగ్యవతంగా ఉంటారని, రక్తహీనత సమస్య తలెత్తబోదని, ఆరోగ్యవంతంగా ఉంటారని సీడీపీఓ పేర్కొన్నారు. అందుబాటులో లభించే వాటితో తయారు చేసుకోవాల్సిన పౌష్టికాహారాన్ని గురించి ఆమె వివరించారు. అందరికీ పౌష్టికాహరం వలన కలిగెడి ప్రయోజనాలపట్ల మహిళలందరికీ అవగాహన కల్పించాలన్న లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ప్రతినెలా సెప్టెంబర్ 1వ తేదీ నుండి 30వ తేదీవరకు పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని, పౌష్టికాహార ప్రదర్శనలు, గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమం, ర్యాలీలు, సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని సునీలతలు పేర్కొన్నారు. నెలరోజులపాటు ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టుపరిధిలోని ఆత్మకూరు మున్సిపల్, ఆత్మకూరు, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల మండలాల్లో ఆయా సెక్టార్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీకార్యకర్తలద్వారా పట్టణంలో, పల్లెల్లో వాడవాడలా అంగన్‌వాడీకేంద్రాల వద్ద ఈకార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ సదస్సుల లక్ష్యం మేరకు అందరూ పౌష్టికాహారం తీసుకోవాలని, తాము నిర్వహించిన సదస్సుల ద్వారా తగిన చైతన్యం పొంది తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యవంతంగా ఉండాలని సునీలత కోరారు. సూపర్‌వైజర్ రత్నమ్మ మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నదే ప్రధాన లక్ష్యమన్నారు. ఈమేరకు ప్రతి గర్భిణీ, ప్రతి బాలింత అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభించే పౌష్టికాహారంతోపాటు తమకు అందుబాటులో లభించే పౌష్టికాహారం కూడా తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హామీదున్నీసా, నారాయణమ్మ, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో చోరీకి పాల్పడిన నిందితులు అరెస్ట్

ఆత్మకూరు, మేజర్‌న్యూస్ : ఆత్మకూరు డివిజన్ పరిధిలోని వివిధ ఆలయాల్లో చోరీకిపాల్పడిన నిందితులను అరెస్ట్ చేశామని స్థానిక డిఎస్‌పి కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆయన సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నిందితులను అరెస్ట్‌చేసి వారివద్దనుండి 2వేలు నగదును, ఆరు గ్రాముల బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతసాగరం మండలంలోని పోలేరమ్మ, తుమ్మలమ్మ ఆలయాల్లో జరిగిన చోరీకేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటుచేసి నలుగురు నిందితులను లింగంగుంట గ్రామంవద్ద అరెస్ట్‌చేశామని ఆయన తెలిపారు. ఈ చోరీ కేసులో ప్రతిభచూపిన ఆత్మకూరు సీఐ, అనంతసాగరం ఎస్‌ఐ, సిబ్బందిని డీఎస్పీ వేణుగోపాల్ అభినందించారు.

## పంచాయతీ కార్యదర్శులకు బదిలీల ఉత్తర్వులు

ఉదయగిరి, మేజర్‌న్యూస్ : మండలంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులను సాధారణ బదిలీల్లో భాగంగా వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శకునాలపల్లి పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న గాజులపల్లి అమర్నా దొడ్డిని బుచ్చిరెడ్డిపాళెం మండలం పంచేడు, గండిపాళెం పంచాయతీ కార్యదర్శి కరీముల్లాను శకునాలపల్లి, కొండాయపాళెం పంచాయతీ కార్యదర్శి నాగూర్ బిని తిరుమలాపురం, అప్పసముద్రం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ను జీ.అయ్యవారిపల్లి, జీ.అయ్యవారిపల్లి పంచాయతీ కార్యదర్శి ఏ.శ్రీనివాసులను అప్పసముద్రం. తిరువ లాపురం పంచాయతీ కార్యదర్శి వెంకటరమణను గండిపాళెం పంచాయతీలకు బదిలీపై చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే ఈవోపీఆర్డీ మల్లికార్జున్న దుత్తలూరు బదిలీ చేశారు. వీరంతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తయిన తరువాత అధికారులు రిలీవ్ చేయనున్నారు.

వీరగాథ 4.0 ప్రాజెక్ట్ విభాగంలో..

## ప్రతిభచూపిన వెన్నవాడ విద్యార్థులు




ఆత్మకూరు, మేజర్‌న్యూస్ : కేంద్రప్రభుత్వం నిర్వ హించిన వీరగాథ్ 4.0 ప్రాజెక్ట్ కార్యక్రమంలో ఆత్మ కూరు మండలం వెన్నవాడ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు తమ వేషధారణలతో అత్యంత ప్రతిభ చూపారు. ఈ పాఠ శాలకు చెందిన 2వతరగతి విద్యార్థిని కంభంశెట్టి నైనిక ఝాన్సీలక్ష్మిబాయి వేషధారణ గావించి ప్రదర్శించగా ఇదే పాఠశాలకు చెందిన 5వతరగతి విద్యార్థి కె.భార్గవ్ అల్లూరుసీతారామరాజు వేషధారణ గావించి అత్యంత ప్రతిభచూపి ప్రదర్శించారు. దేశసేవలో నిమగ్నమై అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించి ఎంతోమంది సైనికులు అమరులవుతున్న విష యం తెలిసిందే. అలాంటి సైనికవీరుల గాథలను విద్యార్థులతో రాయించి రికార్డ్ చేసేందుకు వీరగాథ్ అనే ప్రత్యేక ప్రాజెక్ట్‌ను కేంద్రప్రభుత్వం నిర్వ హిస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కలిశెట్టి రవీంద్రకుమార్ పేర్కొన్నారు. కేంద్ర రక్షణ, విద్యా శాఖలు సంయుక్తంగా ఈప్రాజెక్ట్‌ను చేపట్టగా గ్యాలంటరీ అవార్డ్ గ్రహీతల ధైర్యసాహసాలను, జీవితకథలను తెలుసుకొని రాయడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు ఈ ప్రాజెక్ట్ నిర్వహిస్తున్నారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. ఆ విద్యార్థులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ కె.లావణ్య, ప్రధానోపాధ్యాయులు కలిశెట్టి రవీంద్రకుమార్, సహోపాధ్యాయిని ఆర్.జీవని, తల్లిదండ్రులు అభినందించారు.

నిర్ణీత సమయంలోగా..

## ప్రజా సమస్యలు పరిష్కరించండి

▶ కమిషనర్ సూర్యతేజ



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం అందుకున్న వినతులు పునరావృతం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం అందించాలని అదనపు కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు సూచించారు. విభాగాల వారీగా రెవెన్యూ-2, ఇంజనీరింగ్-11, టౌన్ ప్లానింగ్-11, పబ్లిక్ హెల్త్-1, హౌసింగ్-4, అకౌంట్స్ - 1, ఎస్టాబ్లిష్ మెంట్-1, మొత్తం 31 ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్నారు. అదేవిధంగా అందుకున్న ఫిర్యాదులను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సంబంధిత అధికారులకు తెలియచేసి తక్షణమే సదరు సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ శర్మద, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, మేనేజర్ ఇనాయతుల్లా ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరింటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమలలో జగన్ డిక్లరేషన్ ఇస్తే భారతి ఇంటికి రానివ్వదు

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్ యాదవ్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి తిరుమలకు వస్తున్నాడని చెప్పి పెద్ద బహిరంగ సభకు ప్లాన్ చేశారని, నేను తప్పు చేయలేదు అనే భావన కల్పించాలని జగన్మోహన్ రెడ్డి ప్రయత్నం చేశారని, పవన్ కళ్యాణ్ దీక్ష తీసుకొని స్పందించిన తరువాత, ప్రపంచంలోనే ఒక మార్పు వచ్చిందని, జగన్మోహన్ రెడ్డిని తిరుమలకు ఎవరు రావద్దని అన్నారు. ఎందుకు విరమించుకున్నారని ఆయన ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి డిక్లరేషన్ ఇవ్వమంటే ఎందుకు ఇవ్వడం లేదు అని అన్నారు. హిందువులు హిందువులునే విమర్శిస్తున్నారని ఇది చాలా దుర్మార్గమని, కాకాని గోవర్ధన్‌రెడ్డి, పొన్నవల సుధాకర్‌రెడ్డి ఇల్లు ముట్టడిస్తామని, హెచ్చరించారు. వైసీపీ పాలనలో కిరీటాలు, బంగారం ఎలా మాయమయ్యే అని ఆయన ప్రశ్నించారు. తిరుమల లడ్డు కల్తీ విషయంలో జగన్మోహన్ రెడ్డి నుంచి చైర్మన్ వరకు విచారణ జరిపి వారి పైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. హిందువులు ఐక్యత కొరవడిందని, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు మాలలు వేసుకుని బుకాయిస్తున్నారని, రాబోయే రోజుల్లో హిందూ సమాజమంతా ఏకమవుతుందని ఆయన తెలియజేశారు. జిల్లా నాయకులు కార్యకర్తలు రాష్ట్ర బాధ్యతలో ఉండే వాళ్ళు ప్రజల్లోకి వెళ్ళి సభ్యత్వం చేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి నామాజీ గంగే కన్వీనర్ మిడతాల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యరాబోలు రాజేష్ ,జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్ మోర్చా అధ్యక్షులు అశోక్ నాయుడు, ప్రసాద్, ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గిరికుమార్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, నారాయణ, సుబ్బారెడ్డి, సుమన్ ప్రజా ప్రతి, కార్యకర్తలు పాల్గొన్నారు


# దర్గాను సందర్శించిన రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్





**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేటలోని శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ వారి దర్గాను రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆదివారం రాత్రి సందర్శించారు. శ్రీ హజరత్ కాజా నాయబ్ రసూల్ వారి 251వ గంధ మహోత్సవానికి వచ్చారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈ గంధ మహోత్సవం జరుగుతుంది. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అయిన తొలిసారిగా ఏఎస్పేట దర్గాను సందర్శించడంతో దర్గా ఈవో మహమ్మద్ హుస్సేన్ మైనారిటీ సోదరులు సాంప్రదాయబద్ధంగా స్వాగతించారు. అలాగే టీడీపీ మండల కన్వీనర్ అబ్బూరు రమేష్ నాయుడు మైనారిటీ నాయకులు తదితరులు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. దర్గాలోని వక్ఫ్ బోర్డు కార్యాలయాన్ని సందర్శించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దర్గా లోపల ఉన్న శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దొరసానమ్మల సమాధులపై గలేఫ్ వస్త్రాలు పూల దుప్పట్లు వేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవిని ఇవ్వడం జరిగిందని త్వరలోపూర్తిగా బోర్డు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని దర్గాలు మసీదులను అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అలాగే ఏఎస్పేట దర్గాలో వసతులు ఉన్నాయని ఇంకా మెరుగైన వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చూస్తామని పేర్కొన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఇప్పటికే దర్గా అభివృద్ధికి చర్యలు చేపట్టారని ఆయన సహకారంతో ఏఎస్పేట దర్గాను యాత్రస్థలంగా చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఏఎస్ పేట దర్గాకు వచ్చే భక్తులు యాత్రికులు అక్కడనుండి నెల్లూరు కసుమూరు దర్గాలకు వెళ్లే విధంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయులకు పుస్తకాల అందజేత



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం మండలంలోని 1-10వ తరగతి చదివే విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను ఎంఈవో-2 శ్రీనివాసులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 8,484 పాఠ్య పుస్తకాలను వచ్చాయని, వాటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేసి విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సయ్యద్ జాఫర్ మొ హిద్దీన్, షేక్ మహమ్మద్ గౌస్, నాగయ్య, హుస్సేన్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు వాటర్ ఫిల్టర్ బహూకరణ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి వైకుంఠపురంలోని 35వ వార్డులో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు త్రాగునీరుకి ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కావలి టీడీపీ పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు సోమవారం ఆ స్కూల్లో సుమారు 129 మంది విద్యార్థులు ఇబ్బందులు కష్టాలను చూసి చలించిపోయి తను సొంత నిధులతో ఆ పాఠశాలకు వాటర్ ఫిల్టర్, కుళాయిలను ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాటించా తుళ్లూరు శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ కొమర రమణయ్య, తాత గోపి, ఉప్పాల సుధాకర్, శ్రీనివాసులు, బండ్ల తిరుపతి, మనోహర్ చౌదరి, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సంగం ఎస్ఐగా బాధ్యత స్వీకరించిన రాజేష్



**సంగం, మేజర్‌న్యూస్ :** గతంలో ఆత్మకూరు ట్రైనీ ఎస్ఐగా, మర్రిపాడు ఇన్‌చార్జ్ ఎస్ఐగా తిరిగి ఆత్మకూరు రెగ్యులర్ ఎస్ఐగా గతంలో బాధ్యతలు నిర్వహించి ఆత్మకూర్ ప్రాంతాల్లో అవగాహన ఉన్న రాజేష్ నేడు సాధారణ బదిలీల్లో భాగంగా సంగం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ.. పై అధికారుల సూచనలు ఆదేశాలను పాటిస్తూ ప్రజలకు ఉపయోగపడే విధంగా తన విధులు నిర్వహిస్తానని, సంగంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, సంఘంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా లేకుండా చేస్తానని తెలిపారు. అదేవిధంగా ఎవరికి ఏ సమస్య వచ్చినా ఎప్పుడు ప్రజలకి అందుబాటులో ఉంటానని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

# పీఎం విశ్వకర్మ బ్రిక్ మేషన్ బేసిక్ శిక్షణా తరగతులు ప్రారంభం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరిలో పీఎం విశ్వకర్మ బ్రిక్ మేషన్ బేసిక్ శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభించినట్లు స్పోక్స్ పర్సన్ లక్కినేని ప్రకాష్, ట్రైనర్ సూరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ పథకం ద్వారా ఆరు రోజుల బ్రిక్ మేషన్ బేసిక్ శిక్షకులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. తాపీ పని బేసిక్, టూల్ కిట్ వినియోగంపై హ్యాండ్ బుక్స్ అందజేశామన్నారు.

# ఈఓఆర్డీ మల్లికార్జున బదిలీ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈవోపీఆర్డీ ఎన్.మల్లికార్జున దుత్తలూరు ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ అయినట్లు ఉత్తర్వులు వెలబడ్డాయి. ఈయన వరికుంటపాడు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా గత కొద్దిరోజుల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాధారణ బదిలీల్లో ఆయనను దుత్తలూరుకు బదిలీ చేశారు.

# వైభవంగా గంధమహెూత్సవం





**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ ఖాజా రహమతుల్లా నాయబే రసూల్ వారి 251వ గంధమహెూత్సవం సోమవారం తెల్లవారుజామున అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఆదేశాల మేరకు దర్గా ఈవో షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహల్ లోని దర్గా వంశస్థుడు ఫయాజ్ అహ్మద్ ఇంటి నుంచి సుగంధ ద్రవ్యాలు అత్తరు పన్నీరులతో కలిపిన గంధ కలశమును తలపై ఉంచుకొని మహల్ నుండి బయలుదేరి మేళా తాళాలతో ఫకీరుల జరబులతో బాణాసంచా కాలుస్తూ భక్తి కీర్తనలు పాడుతూ భక్తజన సందోహం నడుమ దర్గాకు చేర్చారు. శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ అమ్మవార్ల సమాధులకు గంధ లేపనం చేసి సమాధులపై పూల దుప్పట్లు గలేప్ వస్త్రాలు ఉంచి ప్రత్యేక ఫాతిహా చదివి సలాములు పాడారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు తొలుత వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో మరో 20 బిందెలు గంధమును కలిపి భక్తులకు పంచి పెట్టారు. గంధ మహెూత్సవం సందర్భంగా ఎలాంటి ఘటనలు జరగకుండా ఆత్మకూరు డిఎస్పీకే వేణుగోపాల్, సంగం, ఆత్మకూరు సీఐలు వేమారెడ్డి, గంగాధరరావు, మరో కొంత మంది సీఐలు పర్యవేక్షణలో పేట ఎస్ఐ ఏ సైదులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా అసిస్టెంట్ ఈవో షేక్ షరీఫ్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గా ఆవరణలో ప్రత్యేకంగా పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

## ప్యూర్ స్మైల్ ట్రస్ట్ డాక్టర్ పర్వీన్‌కు స్ఫూర్తి ఇంటర్నేషనల్ అవార్డు



**నెల్లూరు (కల్చరల్), మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు ప్యూర్ స్మైల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సామాజిక సాంఘిక కార్యక్రమాలను మహిళా అభ్యున్నతి కోసం పాటుపడుతున్న డాక్టర్ పర్వీన్‌కు స్ఫూర్తి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డును తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులోని కింగ్ తిలక్ రోడ్ బొగ్గుల గుంటలో ఉన్న తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో స్ఫూర్తి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ లయన్ ఆకుల రమేష్ తదితర ప్రముఖుల ఆధ్వర్యంలో డాక్టర్ పర్వీన్‌కు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ అవార్డు రావటం ఇంకా తన బాధ్యతను పెంచిందని ఇంకా ఎన్నెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎంతో మంది నిరుపేదలను ఆదుకోవాలని ఆ భగవంతున్ని వేడుకుంటున్నానని, తనకు అనాధ, వృద్ధుల ఆశ్రమాన్ని ఏర్పాటు చేయాలని ఆకాంక్ష ఉందని ఆమె తెలిపారు. పర్వీన్‌కు ఇంటర్నేషనల్ అవార్డు రావడంతో ఆమె శ్రేయోభిలాషులు బంధుమిత్రులు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు



**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** స్వర్ణాంధ్ర-2047 సాధనలో భాగంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాలలోని పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్వర్ణాంధ్ర సాధించుటకు రాబోవు ఐదు సంవత్సరాల్లో విద్యా రంగంలో తీసుకు రావలసిన సంస్కరణలు అనే అంశంపై సోమ వారం నగరంలోని దర్గామిట్ట జడ్పీహెచ్ఎస్ పాఠ శాలలో జిల్లా స్థాయిలో జరిగిన వ్యాసరచన వకృత్వ డిబేటింగ్ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి 152 మంది విద్యార్థులు జిల్లా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంపికయి పోటీల లో పాల్గొన్నారు. ఈ పోటీలలో వ్యాస, వక్తృత్వం, డిబేటింగ్‌లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలిచినటువంటి విద్యార్థులకు సర్టిఫి కెట్లు ప్రధానం చేశారు. వీరి పేర్లను రాష్ట్రస్థాయికి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి నెల్లూరు లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ.. వికసిత్ భారత్-2047లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ఆంధ్ర-2047గా మారాలని 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకుందని, ఈ లక్ష్యంలో భాగంగా 43 వేల డాలర్ల తలసరి ఆదాయాన్ని సాధించే విధంగా అందరికీ అవకాశాలు కల్పిస్తుందని, దీనికోసం రాష్ట్రం 15శాతం వార్షిక వృద్ధిరేటును ఆకట్టుకునేలా లక్ష్యంగా మన రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుందని, దీనికోసం ఇందుకు ప్రతి విద్యార్థి వారి జీవిత లక్ష్యమైన చదువులో ముందంజలో ఉండి తద్వారా రాష్ట్ర స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చాలని, గెలుపొందిన విద్యార్థులకు శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి తమ ఆశీస్సులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మండల విద్యాశాఖ అధికారి మురళీధర, అబ్దుల్ అమీద్, సమగ్ర శిక్ష ఏపీవో ప్రసాదు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా స్థాయికి విచ్చేసిన ప్రతి విద్యార్థి గెలుపొందినట్లేనని ప్రతి ఒక్కరు కూడా అన్ని పోటీల్లో పాల్గొని పోటీ స్ఫూర్తిని నింపుకునేలా ఉండాలని ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మురళీధర్ తెలియజేశారు.

## నరసింహ స్వామి సన్నిధిలో దీపారాధన



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహ కొండపై వెలసి ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జనసేన పార్టీ జిల్లా నాయకులు గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో దీపారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 108 ఒత్తులతో.. 108 నమోవెంకటేశాయనమం మంత్రంతో అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలతో.. హిందూ ధర్మ పరిణాక్షణార్థం నెల్లూరు రూరల్‌లోని నరసింహస్వామి ఆలయంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్ వారి సతీమణి విజయలక్ష్మి 108 దీపాలతో ధీపారాధన చేసి తిరుమల లడ్డు అపవిత్రం చేసిన వారి చట్టరీత్యా శిక్ష పడాలని, ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్న డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఆశయం ఫలించి దర్మపరిరక్షణ జరగాలని, ప్రజలకు పాపం అంటకుండా సుబిక్షమైన పరిపాలన సాగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు గీతా వైభవ్ ట్రస్ట్ చైర్మన్ నజీర్, భాను, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ పాఠశాలలో తనిఖీలు : ఉర్దూ డీఐ



**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** రూరల్ మండలంలోని వావిలేటిపాడులో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలను జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ సోమవారం ఇన్స్‌ఫెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తనఖి అధికారి పాఠశాల ప్రార్ధన సమయానికి హాజరై విద్యార్థులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రభుత్వం వేలాది కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక అభివృద్ధి చేపట్టటమే కాకుండా సాంకేతికంగా డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకుని వచ్చింది అని తెలిపారు. ఉపాధ్యాయులు సాంకేతిక విద్యలో ఎప్పటికప్పుడు అప్డేట్‌గా ఉండి విద్యార్థులకు పాఠాలు బోధించాలని తెలియజేశారు. ప్రతిరోజు యాప్ ద్వారా విద్యార్థుల అటెండన్స్ సకాలంలో నమోదు చేయాలని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన నాణ్యతను రాజీ లేకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను, విద్యార్థుల వర్క్ బుక్స్, సిలబస్, పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల టీచింగ్ డైరీలు, లెసన్ ప్లాన్స్‌ను పరిశీలించారు. మధ్యాన భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రషీద్, ఉపాధ్యాయులు ఖాదరున్నీసా బేగంలు ఉన్నారు.

## ప్రపంచ అంతరిక్ష అంశంపై క్విజ్ పోటీలు

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8,9 తరగతుల విద్యార్థులకు ప్రపంచ అంతరిక్షం అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి పర్యవేక్షణలో లికిత పూర్వక పోటీలు నిర్వహించారు. పరీక్షకు సంబంధించి పేపర్లను ఉపాధ్యాయులు మూల్యాంకనం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శ్రీహరికోట షార్ కేంద్రం వారు బహుమతులు ప్రధానం చేస్తారని ఎంఈఓ తెలిపారు.



# అభివృద్ధికి నోచుకోని ఆత్మకూరు చేనేత కార్మికులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** దశాబ్దాలు గడిచిపోతున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా ఆత్మకూరు ప్రాంతంలో చేనేత కార్మికుల తలరాతలు మాత్రం మారడం లేదని పలువురు కార్మికులు ఆవేదనతో చెబుతున్నారు. ప్రభుత్వం మగ్గాలున్నవారికి ఏదో ఆర్థిక తాత్కాలిక సాయమందిస్తున్నారే తప్ప తమ వృత్తిని అభివృద్ధి పరిచేలా నేటి ఆధునాతన విధానంలో చేనేత సాగించేలా మరమగ్గాలను సమకూర్చే యోచనే ఏ ప్రభుత్వం చేయడం లేదని వారు వాపోతున్నారు. ఆత్మకూరు తాలూకాలో ఆత్మకూరు, సంగం, పొంగూరు, పోలిరెడ్డిపల్లి, యర్రబల్లి, సంగం, హసనాపురం, ఏఎస్‌పేట, గండువారిపల్లి, కావలియడవల్లి, జమ్మవరం, దూబగుంట, జువ్వలగుంటపల్లి, చందలూరుపాడు తదితర గ్రామాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. అయితే అయితే గతంలో లాగా వారు చేనేత వృత్తి సాగిస్తే గిట్టుబాటు ధర లబించడం లేదు. దాంతో చాలామంది వృత్తికి దూరమవుతున్నారు. కాని ఇతర వృత్తుల్లో సాగలేక చాలామంది ఇబ్బందిపడుతున్నారు. వారిలో మగ్గాలున్నవారికి ప్రభుత్వం తాత్కాలిక ఆర్థిక సాయమందించినా ఫలితం లేదని, శాశ్వత ప్రాతిపదికన తాము వృత్తిని సాగించాలంటే తమకు కొంత శిక్షణనిచ్చి ఆధునిక మరమగ్గాలను ప్రభుత్వం సమకూర్చితే తాము వృత్తిద్వారా జీవనోపాధి పొందగలమని, గతంలోలాగా బ్రతుకు సాగించగలమని చెబుతున్నారు. 1975వరకు తమ

## ▶▶ మౌళికవసతులు కరువు ▶▶ అధునాతన మగ్గాల యోచన మృగ్యం

చేనేత వృత్తి బాగుండేదని, అనంతరం క్రమీణా గిట్టుబాటు కాని పరిస్థితి ఏర్పడిరదని, తమకు బ్యాంకుల ద్వారా రుణసౌకర్యం కూడా కల్పించలేదని ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వీవర్స్‌కాలనీ వాసులు చెబుతున్నారు. చేనేత వస్త్రాలకు డిమాండ్ పెరిగినా ఆ గిరాకికి తగ్గట్లుగా తాము అధునాతనరీతిలో నేతనేసే పరిస్థితి లేదని, నాటుమగ్గాలపై సాధ్యం కావడం లేదని చెబుతున్నారు. ఆత్మకూరు వీవర్స్‌కాలనీలో పాతికేళ్ళ క్రితం 50కుటుంబాల వాఇరం ప్రభుత్వం అప్పట్లో మంజూరు చేసిన చిన్నపాటి గృహాలు నిర్మించుకున్నామని, కుటుంబాల సంఖ్య 70కు పెరిగినా ప్రభుత్వం నుండి తగిన ఆదరణ లబించలేదని, తమకు పాఠశాల లేదని, అంతర్గత రహదారులు, సైడుకాలువలు లేవని, కాలనీలో ఆక్రమణలు పెరిగిపోయాయయని, తమ వృత్తి గిట్టుబాటు కాక కొందరు వలసవెళ్ళారని చెబుతున్నారు. మగ్గాలున్న వారికి ప్రభుత్వం 24వేల రూపాయల వంతున సాయమందించిందని, కానీ శాశ్వత ప్రతిపదికన మరమగ్గాలు మంజూరు చేయాల్సిన అవసరం అనివార్యమని వారు పేర్కొన్నారు. గతంలో నెల్లూరుపాళెం పంచాయతీలో ఉన్న తమ ఓట్లు మాత్రం ఆత్మకూరు పంచాయతీలో ఉండడంతో అభివృద్ధికి నోచుకోలేదని, అయితే మున్సిపల్ పరిధిలో చేర్చినా తగిన మౌళిక వసతులు కల్పించడం లేదని, గృహాలకు మరమ్మత్తులు లేదా కొత్తగా ఇళ్ళు మంజూరుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు చెబుతున్నారు. తమ కాలనీనుండి రోడ్డు వెంబడి చిన్నారులు ఆత్మకూరు పట్టణంలోకి బడికి వెళ్ళడం ఇబ్బందికరంగా ఉందని, తమ కాలనీలోనే ఒక స్కూలు ఏర్పాటుచేయాలన్న తమ కోరిక కంఠశోషగానే మిగిలిందని వారు పేర్కొన్నారు. పవర్‌లూమ్స్ (విద్యుత్ మగ్గాలు) మంజూరుకు అనేక దపాలు విన్నపాలు చేసినా ఎవరూ పట్టించుకోలేదని కూడా వారు ఆవేదనతో చెబుతున్నారు. పాతికేళ్ళకు ముందు నిర్మించిన చిన్నపాటి కాలనీ గృహాలు శిధిలం కాగా వాటి మరమ్మత్తులకు సాయమందించాలని ప్రభుత్వాలకు విన్నపాలు చేసినా ఫలితం లేకపోయిందని వారు చెబుతున్నారు. తమ చేతివృత్తికి ఆధునికత కల్పిస్తే తమ జీవనశ్కెలిమారుతుందని, తగిన ఉపాధి లభిస్తుందని వారు చెబుతున్నారు. పాతికేళ్ళక్రితం ఇచ్చిన గృహాల స్థానే కొత్తగా పక్కాగృహాలు మంజూరు చేయాలని కూడా వారు కోరుతున్నారు. పవర్‌మగ్గాలపై నేతనేసే శిక్షణా కార్యక్రమం తమ కాలనీలోనే ఏర్పాటు చేసి శిక్షణానంతరం సబ్సిడితో పవర్‌లూమ్స్‌ను మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. నెల్లూరు, వెంకటగిరిలాగా ఆత్మకూరు ప్రాంతంలో కూడా చేనేత వృత్తిని అభివృద్ధిచేసి తాము జీవనోపాధిపొందేలా నూతన ప్రభుత్వం పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. మరి ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

# గర్భిణీలు, బాలింతలకు అత్యంత ప్రయోజనకరం పౌష్టికాహారం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అత్యంత ప్రయోజనకరం, అనివార్యమని, గర్భిణీలు, బాలింతలు తప్పకుండా తీసుకోవాలని ఆత్మకూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.నాగేశ్వరమ్మ పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని దేపూరు ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ సునీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల అవగాహనా కార్యక్రమంలో ప్రసంగించారు. పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేసి అందరికీ వాటిని గురించి నాగేశ్వరమ్మ వివరించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. పౌష్టికాహారం గర్భిణీలు, బాలింతలకు అత్యంతావశ్యకమని, అందుకే ప్రభుత్వం పౌష్టికాహారం, పాలు, కోడిగ్రుడ్లు, బాలామృతం తదితరాలను అందిస్తుందని తెలిపారు. దాంతోపాటు తమకు అందుబాటులో లభించే వివిద పోషకవిలువల ఆహారాన్ని కూడా తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని, రక్తహీనత సమస్య తలెత్తబోదని ఆమె పేర్కొన్నారు. ఈఅంశాలపట్ల అందరికీ అవగాహన కల్పించాలన్న లక్ష్యంగా ప్రతిఏటా సెప్టెంబరులో గ్రామగ్రామాన, వాడవాడలా ముమ్మరంగా అవగాహనా సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని, గర్భిణీలు, బాలింతలు తప్పకుండా అవగాహన పెంపొందించుకోవాలని, పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా



అందించే పౌష్టికాహరాలను లబ్దిదారులే తప్పకుండా వినియోగించుకోవాలని నాగేశ్వరమ్మ కోరారు. పౌష్టికాహారం అత్యంత ప్రయోజనకరమని, ఈ విషయాలు తెలిపేందుకే ప్రత్యేకంగా అవగాహనా సదస్సులు నిర్వహించామన్నారు. కాబట్టి గర్భిణీలు, బాలింతలందరూ తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని నాగేశ్వరమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి.అమృత, ఆశా కార్యకర్త, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలను అధిగమించండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** తపాలా ఉద్యోగులకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో తపాలా సేవలను మెరుగుపర్చాలని నెల్లూరు డివిజన్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తపాలా కార్యాలయ ఆవరణలో ఉద్యోగులకు కేటాయించిన లక్ష్యాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు కేటాయించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రజలతో మమేకమై పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇండియా పోస్ట్ పేమె ట్ బ్యాంకు ఖాతాల ద్వారా గ్రూప్ యాక్సిడెంట్ పాలసీలు విరివిగా చేయాలన్నారు. లక్ష్యాలు అధిగమించని ఉద్యోగులు త్వరితగతిన వాటిని పూర్తి చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం తపాలా బీమా పాలసీలు, ఖాతాల ప్రారంభంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన బీపీఎంలకు సిల్వర్ కాయిన్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐపీవో సాయికృష్ణారెడ్డి, ఎస్పీఎంలు అనిల్, నజీరాబాషా, తిరుపాలయ్య, నరసయ్య, గౌరజ్, మెయిల్ ఓవర్సీస్ రామకృష్ణారెడ్డి, మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రంగస్థల, జానపద, పండిరిభజనల, తోలుబొమ్మలాటల, వీధిబాగవతంల కళాకారుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ప్రాంతంలోని కళాకారులసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. గత ప్రభుత్వం వద్ద ఎంతగా మొరపెట్టుకున్నా వృద్ధకళాకారులకు పెన్షన్లు, ఆర్టీసీబస్సుల్లో రాయితీ, కళాకారులకు గుర్తింపుకార్డుల మంజూరు, దేవాలయాల్లో, ఆధ్యాత్మికకేంద్రాల్లో ప్రదర్శనలకు అవకాశం ఇవ్వకపోగా రంగస్థల వృత్తికళాకారులకు బ్రతుకుదెరువుగా ఉన్న చింతామణి నాటక ప్రదర్శనను నిషేధించారని వారు ఆవేదనతో తెలిపారు. గతంలో 15సంవత్సరాల క్రితం నెల్లూరు జిల్లాలో 560మందికి మాత్రమే వృద్ధకళాకారుల పెన్షన్ మంజూరు చేశారని, అనంతరం ఎంతగా మొరపెట్టుకున్నా 60సంవత్సరాలు దాటిన అర్హులు వందలాదిమంది ఉన్నా వారికి పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. చింతామణినాటక ప్రదర్శనపై విధించిన నిషేధం రద్దుచేయాలని అరిచిగీపెట్టినా గత ప్రభుత్వం ఏమాత్రం పట్టిచుకొనకుండా పెడచెవినపెట్టిందన్నారు. కళాకారులకు గుర్తింపుకార్డులంటూ దరఖాస్తున్న స్వీకరించిన గత ప్రభుత్వం కార్డులివ్వనేలేదన్నారు.

వయసుమీరిన అర్హులైన కళాకారులకు పెన్షన్లు మంజూరుచేయాలన్నా జిల్లాపౌరసంబంధాలశాఖకు దరఖాస్తులు చేసే అవకాశం కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదని వారు ఆవేదనతో తెలిపారు. గుర్తింపు కార్డులుంటే ఏదేని ప్రదర్శనలకు వెళ్ళే సమయంలో ఎవరూ అడ్డుకొనకుండా ఉంటుందని భావించినా ఆకార్డులు ఇవ్వలేదన్నారు. ప్రదర్శనలకోసం వివిద ప్రాంతాలకు ప్రయాణాలు చేయాల్సి ఉన్నందున ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని కూడా కోరినా పట్టించుకోలేదన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా కళాకారుల వృత్తి ప్రాధాన్యతగా అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని, అందరు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలని, ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని, కళాప్రదర్శనలే వృత్తిగా నమ్ముకొని సరైన అవకాశాలు లేక ఇబ్బందిపడుతున్నందున కళాకారుల ప్రదర్శనలకు దేవాలయాలు, ధార్మికసంస్థల్లో అవకాశం కల్పించాలని వారు నేటి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తామూ ప్రజలమేనని, ఓటర్లమేనని, తాము కూడా ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నామని, అన్నివర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేస్తున్న ప్రభుత్వం కళాకారులను కూడా ఆదుకోవాలని, తమ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

## ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రచార సమాగ్రి పంపిణి



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యా లయంలో పశు వైద్య ఎన్ఎస్ఎస్ విభాగంలో వాలంటర్లుగా ఉన్న విద్యార్థిని, విద్యార్థులను కళాశాల స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత పరిరక్షణ ప్రచార సమాగ్రిని అంద జేసినట్లు అసోసి యేట్ డీన్ డా.పి.జగపతి రామయ్య తెలిపారు. ప్రచార సమాగ్రిలో మై భారత్ టోపీలు, పుస్తకాలు, పెన్నులు, చేతితొడుగులు అందించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలలో చైతన్యం, అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత గా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డా. రేణుక, ఎన్ ఎస్ ఎస్ అధికారులు శ్రీనివాసరావు, అమరావతి, వెంకటేశ్వర్లు, రాజా, మూడవ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

## కామిరెడ్డిని కలిసిన వైకాపా నేతలు



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని చిల్లకూరు గ్రామానికి చెందిన మాజీ ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్, వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ని మండలానికి చెందిన వైకాపా నేతలు చిల్లకూరు లోని అయన నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య ఆశీస్సులతో అమెరికా పర్యట నను ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు పోలంరెడ్డి శేఖర్ రెడ్డి,చిల్లకూరు సర్పంచ్ పగడాల హరిబాబు రెడ్డి, వైస్సార్సీపీ ఎస్.సి. సెల్ అధ్యక్షులు చుట్టు గురవయ్య, నాయకులు పివి రమణా రెడ్డి,ఇలుపూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి పాత్ర చిరస్మరణీయం



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుని పాత్ర చిరస్మరణీయంగా మిగిలి పోతుందని మండల విద్యాశాఖ అధికారి మించల శంకరయ్య అన్నారు. పెళ్లకూరులోని చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ నందు ఉన్నత పాఠశాల పెళ్లకూరులో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న నేలవల్లి మునికృష్ణయ్య ఉద్యోగ విరమణ చేపట్టిన సందర్భంగా ట్రస్ట్ నందు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈఓ ముంచల శంకరయ్య మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఉద్యోగ నిర్వహణలో ఆయన చేసిన సేవలు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తాయన్నారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ వృత్తి చాలా కష్టతరంతో కూడుకున్నదని తెలిపారు. అనంతరం పదవి విరమణ చేపట్టిన నేలవల్లి మునికృష్ణయ్య వారి సతీమణి యశోదకు పాఠశాల సిబ్బంది పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందించారు.పాఠశాలలో మునికృష్ణయ్య చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్ర మంలో ప్రధాన ఉపాధ్యాయులు ముని శేఖర్ పాఠశాల సిబ్బంది సురేంద్ర బాబు,సుధాకర్, సిఆర్పీ చెంగయ్య, మాజీ విద్యా కమిటీ చైర్మన్ యాగని జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థినికి అభినందనలు



**వాకాడు, మేజర్‌న్యూస్:** మండలంలో బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయంలో శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కోట మండలం సిద్ద వరం గ్రామానికి చెందిన నాశిన కృష్ణ,రాజేశ్వరి దంప తుల కుమార్తె నాశిన పవిత్ర అనే విద్యార్థిని వైద్య విద్యలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో సీటు సాధించిన సందర్భంగా వాకాడు మాజీ సొసైటీ చైర్మన్, ఆలయ ధర్మకర్త కొడవలూరు దామోదరరెడ్డి అభినందనలు తెలిపి చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో ప్రాథమిక విద్యను అభ్యసించిన నాశిన పవిత్ర అనే చిన్నారి పట్టుదల,కృషితో వైద్య విద్యలో సీటును సాధించడం సంతోషకరమని ఈ సందర్భంగా తనకు శుభాభినందనలు తెలియజేశారు. శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు మాట్లాడుతూ మారుమూల పల్లెలో వ్యవసాయ కుటుంబంలో జన్మించి ప్రాథమిక విద్యను గ్రామీణ ప్రాంతంలోనే చదువుకుని వైద్య విద్యలో సీటును సాధించడం గొప్ప విషయమని ఈ సందర్భంగా చిన్నారికి తమ సంస్థ తరపున చిరు సత్కారాన్ని చేశామన్నారు. కార్యక్రమంలో హరీష్,శివ,నాశిన కృష్ణ,శేఖర్, వంశీ,కిరణ్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన పలువురు అధికారులు



**పలమనేరు, మేజర్‌న్యూస్:** సాధారణ బదలీల్లో భాగంగా పలమనేరుకు బదలిపై వచ్చి విధులు చేపట్టిన పలువురు అధికారులు ఎమ్మెల్యే ఎన్. అమర్నాథరెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మేరకు పలమనేరు ఎక్సైజ్ సిఐగా విధుల్లో చేరిన భాగ్యలక్ష్మి, సబ్ రిజిస్ట్రర్‌గా విధుల్లో చేరిన సుబ్రహ్మణ్యం, పలమనేరు డిప్యూటీ తహసిల్దార్ గా విధుల్లో చేరిన అనిల్ కుమార్ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని న్యాయం చేయండి

**- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన బాధితులు**



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** గత 75 సంవత్సరాలుగా తమ అనుభవంలో ఉన్న భూమిని కొందరు అక్రమంగా కబ్జాకు పాల్పడుతున్నారని చిత్తూరు నగరం లోని ఇరువారం, పీహెచ్ కాలనీ, పోతంబటు గ్రామాలకు చెందిన బాధితులు వాపోయారు. ఈ మేరకు ఇరువారంకు చెందిన ఏ బాలకృష్ణ కుమారుడు ఏ రాజ్ కుమార్, వనరాజ్ కుమారుడు భాస్కర్, ఇరువారం వికలాంగుల కాలనీకి చెందిన మునస్వామి కుమారుడు హరిబాబు తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్ కుమార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ఇరువారం రెవిన్యూ లెక్క దాఖలా లోని సర్వే నంబర్ 263/ 4 లోని ఏ రాజ్ కుమార్ పేరిట ఉన్న ఒక ఎకరా, సర్వేనెంబర్ 263/1, సర్వే నంబర్ 263/2 లోని భాస్కర్ పేరిట ఉన్న 68 సెంట్లు, 263/ 4 లోని హరిబాబు పేరిట ఉన్న 12 సెంట్లు భూమిని తమ భూములకు సమీపంలో ఉన్న మేరీ అనే మహిళ కొంతమంది అనుచరులతో కలిసి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాజ్ కుమార్ మాట్లాడుతూ 1948 లో తమ తాత అన్నాస్వామి కష్టార్జితంగా సంపాదించుకున్న ఒక ఎకరా భూమిని ఆయన కుమార్తె జయమ్మ ( రాజ్‌కుమార్ తల్లి)కు 1973లో ఆడబిడ్డ పసుపు, కుంకుమ కింద దానం చేశారని పేర్కొన్నారు. అనంతరం తమ తల్లి జయమ్మ చనిపోయిందని ఈ నేపథ్యంలో ఆమె పేరిట ఉన్న ఎకరా భూమిని తనతోపాటు తమ్ముడు భాగ్యరాజ్ చెరి సగం పంచుకున్నామన్నారు. అయితే పలు ఆర్థిక కారణాలతో తన తమ్ముడు తన వద్ద తీసుకున్న రూ 5 లక్షలకు ప్రతిఫలంగా భాగ్యరాజ్ అర ఎకరా భూమిని తనపై విక్రయ రిజిస్టర్ చేయించాడని వెల్లడించారు. భాస్కర్, హరిబాబు మాట్లాడుతూ తమ పేరుపై ఉన్న కొంత భూములను సైతం మేరీ తదితరులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. తమ ముగ్గురి భూములకు సమగ్ర డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయన్నారు. గతంలో జయపాల్ రెడ్డి అనే వ్యక్తి తామెవ్వరికి తెలియకుండా ఫేక్ డాక్యుమెంట్లతో ఇంటి స్థలాలుగా మార్చి గుట్టు చప్పుడు కాకుండా కొంత మందికి తమ భూమిని విక్రయించేశారని తెలిపారు. దీంతో కబ్జాదారులు సంబంధిత ఫేక్ డాక్యుమెంట్లను అడ్డు పెట్టుకొని భూములు తమవంటూ తరచూ బెదిరిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

# తూతూ మంత్రంగా పౌర హక్కుల దినోత్సవం!

**వి.కోట, మేజర్‌న్యూస్:** మండలంలో ప్రతినెల నిర్వహించాల్సిన పౌరహక్కుల దినోత్సవానికి వి.కోట ఎస్సై గిరాజరయ్యారు. సోమవారం గోనమాకులపల్లి గ్రామపంచాయతీ నాగిరెడ్డిపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని తాసిల్దార్ ఏర్పాటు చేశారు. నిబంధనల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీల హక్కులు రక్షణ చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి. అయితే ఎస్సై



సమావేశానికి హాజరు కాకపోవడంపై దళిత సంఘాలు మండిపడ్డాయి.ఎస్సీ ఎస్టీల పట్ల రక్షణ కవచంగా నిలబడాల్సిన రక్షణ శాఖ వారి పట్ల వివక్ష చూపడం తగదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాల్ని అవగతం చేయకుండా అన్ని వర్గాలకు ఇస్తారంటూ మాట్లాడారు.ఎస్సీ ఎస్టీల సమస్యలు మాత్రమే ప్రస్తావించాల్సిన కార్యక్రమంలో షెడ్యూల్ లేతర సమస్యల లేవనెత్తడంపై గ్రామస్తులు మండిపడ్డారు.మా కోసం వచ్చారా.. ఇతరుల కోసం వచ్చారా అంటూ పెదవిరిచారు.దేశానికి స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడిచిన పలువురు పూరి పాకలోనే కాలం వెళ్లదీస్తుండ దం గమనార్హం.ఎస్సీలకు స్మశాన స్థలాన్ని కేటాయించాలని, ఓనిమిదారిని బాగు చేయాలని ఎస్సీ కాలనీవాసులు డిప్యూటీ తాసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. పింఛన్లు, పక్కా ఇల్లు మంజూరు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు దొరస్వామి వినోద్ గణపతి సోము తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ డీఎస్సీలో జిల్లా విద్యార్థిని తహసీన్‌కు మొదటి ర్యాంక్



**పలమనేరు, మేజర్‌న్యూస్:** తెలంగాణ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి విద్యాశాఖ నిర్వహించిన టిజి డిఎస్సి 2024 పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఉదయం 11 గంటలకు సచివాలయంలో డీఎస్సీ పరీక్ష ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ ఫలితాలలో హైదరాబాద్ జిల్లాలో రాసిన పలమనేరు వాసి షేక్ తహసీన్ మొదటి ర్యాంకు సాధించారు. తెలంగాణలో నిర్వహించిన డీఎస్సీ నందు 75.57 మార్కులతో ఆమె మొదటి స్థానం సాధించారు. ఈ అమ్మాయి 10వ తరగతి ఇంటర్మీడియట్ లలో కూడా మంచి మార్కులతో కాలేజీ టాపర్గా నిలిచింది. తెలంగాణలో జరిగిన డీఎస్సీ ఫలితాలలో చిత్తూరు జిల్లా అమ్మాయి మొదటి ర్యాంకు సాధించడం పట్ల ఏ ఏ పిటిఏ జనరల్ సెక్రటరీ మునాఫ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇదేవిధంగా కష్టపడి ఆంధ్రప్రదేశ్లో నిర్వహించే డీఎస్సీలో కూడా మొదటి ర్యాంకు సాధించాలని ఆయన కోరారు.

## నేడు డైట్ ఆవరణలో శ్రీ సారంగపాణి పద పరిచయ కార్యక్రమం

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటి నగరంలో ఉన్న జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్ లో కార్వేటి నగరం వేణుగోపాలస్వామిని ఆరాధించిన పరమ భక్తుడు వాగ్గేయకారుడు శ్రీ సారంగపాణి పద పరిచయ కార్యక్రమం, సంగీత సాహిత్య గేయ ధార కార్యక్రమం నేడు ఉదయం 10 గంటలకు కార్వేటినగరం సరస్వతి ఆడిటోరియం నందు నిర్వహించబడును. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థి అష్రఫ్

**గూడూరు రూరల్ మేజర్ న్యూస్:** స్థానిక సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి అష్రఫ్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ దయాకర్ తెలియజేశారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు మండల స్థాయి. డివిజన్ స్థాయి.జిల్లా స్థాయిలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి అష్రఫ్‌ను సత్కరించారు. ముందుందు ఇలాంటి విజయాలను ఎన్నో సాధించి తల్లిదండ్రులకు పాఠశాలకు దేశానికి మంచి పేరు తీసుకురావాలని కొనియాడారు. అనంతరం ప్రైమరీ ప్రిన్సిపాల్ శ్రావణి మాట్లాడుతూ ఇంతటి చక్కటి విజయాన్ని సాధించిన అష్రఫ్ కు అభినందనలు తెలియజేశారు. మాపాఠశాలలో కేవలం విద్య మాత్రమే కాకుండా అన్ని రంగాలలో విద్యార్థులను ముందుకు నడిపిస్తున్నామన్నారు. ఇంత చక్కటి విజయానికి సహకరించిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చైతన్య తనను ప్రోత్సహిస్తున్నటువంటి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు ఇంతియాజ్ ఆయేషాలు, ఉపాధ్యాయులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటికి మొదటి ప్రాధాన్యత కల్పించండి



- నియోజకవర్గంలో త్రాగునీటికి మొదటి ప్రాధాన్యత కల్పించండి
- నియోజకవర్గంలోని 143 పంచాయితీలలో త్రాగునీటి ఎద్దడి లేకుండా పని చేయండి
- ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే కాకర్ల

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గంలోని 143 పంచాయతీలలో త్రాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం నెల్లూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జలసిరి ఎన్టీఆర్ సృజల స్రవంతి పథకాల గురించి వివరాలు సేకరించారు. అనంతరం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. జలసిరి ద్వారా నియోజకవర్గంలో రైతులకు అత్యధిక బోర్లు వేసేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఎన్టీఆర్ సృజల స్రవంతి ద్వారా అవసరమైన పంచాయతీలలో మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. క్లోరిన్ రహిత నియోజకవర్గంగా ఉదయగిరిని రూపుదిద్దేలా కృషి చేయాలని తెలిపారు. మూగజీవాల కోసం అవసరమైన చోట్ల బోర్లు వేసి చేతిపంపులు అమర్చాలన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో మంజూరై అసంతృప్తిగా మిగిలిపోయి ఉన్న 8మండలాల్లో ఉన్న మదర్ ప్లాంట్ల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. తదితర అంశాలపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ రాదయ్య, వింజమూరు డిఈఈ బి.భావనారాయణ కలిగిరి ఏఈఈ ఎస్.కె మషోద్ అహ్మద్ జలదంకి ఏ ఈఈ ఏ సతీష్ బాబు కొండాపురం ఏఈఈ ఎస్.కె జిలాని బాషా, దుత్తలూరు ఏఈఈ టి.హరిత, వింజమూర్ ఏఈ కె వరప్రసాద్, వరికుంటపాడు ఏఈ ఆర్.హనీ నిశి ఎస్ఆర్‌పురం ఏఈ పి.జగన్నాథం తదితరులు ఉన్నారు.

**శాలివాహన సంక్షేమ భవనం..**

# అందరి సొత్తు.. ఎవరబ్బ సొత్తు కాదు

**పెళ్లూరు సుమన్ ప్రజాపతి**



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** శాలివాహన సంక్షేమ భవనం అందరి సొత్తు అని.. ఎవరబ్బ సొత్తు కాదని కుమ్మర యువసేన రాష్ట్ర అధ్యక్షులు పెళ్లూరు సుమన్ ప్రజాపతి పేర్కొన్నారు. ఆదివారం శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కొత్తూరు-అంబాపురం వద్ద జిల్లాలోని లక్షకు పైగా ఉన్న కుమ్మర్ల ఆకాంక్ష మేరకు ఎన్నో ఆశలతో కష్టపడి నిర్మించుకున్న శాలివాహన సంక్షేమ భవనం నందు జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఉన్న ముఖ్యమైన కుమ్మర నాయకులు వందలాదిగా హాజరైయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి పెళ్లూరు సుమన్ ప్రజాపతి మాట్లాడుతూ.. ఈ భవనానికి జిల్లా స్థాయిలో సుమారు 15 సంవత్సరాల క్రితం 41 మందితో కమిటీ వేశామని ఆ కమిటీ ఆధ్వర్యంలో నేటివరకు నడిపారని ఈ 15 సంవత్సరాలలో అనేక రకాలుగా కుమ్మర్లకు ఆ సంక్షేమ భవనం నందు అన్యాయం జరిగిందని, ఎన్నో అవకతవకలు జరిగాయని, కొన్ని చెప్పుకోలేని అసాంఘిక కార్యక్రమాలు చేసారని, అదేమని అడిగిన కమిటీ సభ్యులకు సైతం సమాధానం చెప్పకుండా వారిని తదుపరి సమావేశాలకు పిలవకుండా దూరం పెట్టడం జరుగుతుందని చెప్పుకొచ్చారు. ఈ సమావేశానికి ఆ ప్రస్తుత కమిటీ సభ్యుల ఎదుట ఈ భవనంలో జరిగిన తప్పులను గురించి వివరణ అడగగా వారు సరైన వివరణ ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేయటంతో సమావేశానికి హాజరైన కులస్థుల అందరి ఆమోదంతో ప్రస్తుత కమిటీని రద్దు చేసి అక్టోబర్ 20 వతేది ఆదివారం నాడు జిల్లా మొత్తం కుమ్మర్లను అక్కడకు చేర్చి అందరి ఆమోదంతో నూతన కమిటీని ఎన్నుకొని వారికి శాలివాహన సంక్షేమ భవనం యొక్క నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ, ఆ భవన కమిటీ స్వతంత్రంగా ఉంటూ జిల్లాలోని అన్ని కుమ్మర కుల సంఘాలను కలుపుకొని ముందుకు వెళుతుందని సుమన్ ప్రజాపతి చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో భవన కమిటీ అధ్యక్షులు కేవీస్ నరసయ్య, ఉపాధ్యక్షులు ఆలూరు రఘు రామయ్య, యడవల్లి వెంకటేశ్వర్లు, పత్తిపాటి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పెళ్లూరు శ్రీనివాసులు, కోశాధికారి మాలేపాటి మాల్యాద్రి, అకౌంటెంట్ తొలికొండ వెంకటేశ్వర్లు, సభ్యులు గొట్టం శ్రీరాములు, రామయ్య, కావలి వెంకయ్య, హాజరత్తయ్య, మాలేపాటి కొండయ్య, యడవల్లి శ్రీనివాసులు, సత్రవాడ వడివేలు, వడ్లపూడి బాబయ్య, తుమ్మలపల్లి మధుసూదన్, కుమ్మర కుల భాందవులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ మృతిచెంది ఏడాదిపూర్తి : ఎన్నికల ఊసే నాస్తి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 12వవార్డుకు చెందిన కౌన్సిలర్ మృతిచెంది ఏడాదిపూర్తికాగా ప్రభుత్వం ఉప ఎన్నిక నిర్వహించే యోచనే చేయడంలేదు. సాధారణంగా ఒక కౌన్సిలర్ మృతిచెందితో ఆరునెలలనుండి ఏడాదిలోగా ఉప ఎన్నిక నిర్వహిస్తారన్న ప్రచారం ఉంది. కాగా గత సెప్టెంబర్‌లో 12వవార్డు మున్సిపల్ కౌన్సిలర్ కొండా యుగలక్ష్మి(వైసిపి) అనారోగ్యంతో మృతిచెందారు. ఈవార్డుకు ఇప్పటివరకు ఎన్నిక నిర్వహించాలన్న యోచనే కానరావడం లేదు. ఈవార్డులో ఉప ఎన్నిక జరపాలని కొందరు నాలుగునెలల క్రితం మున్సిపల్ కమీషనర్‌కు ఒక వినతిపత్రం కూడా సమర్పించారు. ఆయన ఈ విన్నపాన్ని ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు. కానీ ఇంకా ఉప ఎన్నిక నిర్వహించే పరిస్థితే కానరావడం లేదు. మరి ప్రభుత్వం ఎన్నినెలలకు ఉప ఎన్నిక జరుపనుందో చూడాల్సి ఉంది. యుగలక్ష్మి వైసిపి అభ్యర్థిగా అప్పట్లో తెలుగుదేశం అభ్యర్థి గొరిపర్తి నాగభూషణమ్మపై పోటీచేసి విజయం సాధించారు.



సూర్య www.suryaa.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దిన పత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకుల కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని అల్లూరు, దగదర్తి, దుత్తలూరు, కొండాపురం, బుచ్చి, మనుబోలు, కొడవలూరు, కోవూరు, ఇందుకూరుపేటలలో విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
సూర్య కార్యాలయం, మిలిటరీ కాలనీ, రోడ్ నెం.1, LIC & CID ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు.
సెల్: 9000 118811


# నల్ల చెరువులో అక్రమ మట్టి దందా

- అదుపులో 11 ట్రాక్టర్లు
- కేసు నమోదుకు చర్యలు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం పడమటి కమ్మంపాడు నల్లచెరువులో ఆదివారం అర్ధరాత్రి చేపట్టిన అక్రమ మట్టి త్రవ్వకాలపై పోలీసులు కొరడా జులిపించారు. చెరువులో మట్టి త్రవ్వకాలు చేపడుతున్నారన్న సమాచారంతో సోమశిల స్టేషన్ ఏఎస్ఐ కే.లక్ష్మీ నారాయణ సంఘటన స్థలానికి వెళ్లారు. పోలీసుల రాకను గమనించిన జెసిబి డ్రైవర్ వాహనం వదిలి పరారయ్యారు. మట్టి త్రవ్వకాలు జరిపి రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 11 ట్రాక్టర్లను అదుపులో తీసుకొని స్టేషన్కు తరలించారు. ఆత్మకూరు సీఐ ఆదేశాలతో వాహనాల వివరాలను నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సీఐ విచారణ అనంతరం వాహనదారులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి జన్మదినోత్సవ వేడుకలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి-1 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారి షేక్ అల్ఫా జన్మదినోత్సవ వేడుకలను అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షకీలా ఘనంగా నిర్వహించారు. చిన్నారి అల్ఫాచేత జన్మదినోత్సవ కేక్‌ను కట్‌చేయించి అందరికీ పంచిపెట్టారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని అలంకరించి అత్యంత ఘనంగా చిన్నారి జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ చిన్నారి తల్లిదండ్రులు షేక్ ఖలీద్-పగుప్తాఅక్తర్ దంపతులు అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నారుల కోసం స్టీలు ప్లేట్లు, గ్లాసులు విరాళంగా సమకూర్చి అంగన్‌వాడీ కార్యకర్త షకీలాకు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో తమ బిడ్డ జన్మదినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడం సంతోషకరంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సహాయకురాలు విజయమ్మ, పలువురు మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

